క్లుప్తంగా

నేడు విద్యుత్ అంతరాయం

చిత్తూరు కార్పొరేషన్: డివిజన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఈఈ మునిచంద్ర తెలిపారు. ఈ మేరకు నగరంలోని దొడ్డిపల్లె, గుడిపాల మండలంలోని పానాటూరు, పాపసముద్రం, 197 రామాపురం, పూతలపట్టు, పాలసముద్రం మండలాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు మార్పును గమనించాల్సిందిగా కోరారు.

ప్రతి ఇంటికీ వైద్య సేవలు


వైద్యసేవలు అందిస్తున్న వైద్యులు

గుడిపాల: ప్రతి ఇంటికీ సకాలంలో వైద్యసేవలు అందిస్తున్నామని డాక్టర్ రష్మిత అన్నారు. ఏఎల్‌పురం గ్రామంలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఇంటిలో అవసరమైన వారికి వైద్యసేవలు అందించనున్నట్లు తెలిపారు. హెల్త్ క్లినిక్‌ల ద్వారా మంచం పట్టిన రోగుల ఇంటి వద్దకే వెళ్లి వైద్యం అందిస్తున్నట్లు వివరించారు. అనంతరం గర్భిణులు, షుగర్ పేషెంట్‌లకు వైద్య చికిత్సలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. 66 మంది రోగులకు చికిత్సలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది హైమావతి, సుమతి, కార్లినమ్మ, రీటా తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి


లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

ఐరాల: ప్రభుత్వ ఆదేశాల మేరకు లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ ధనలక్ష్మి సూచించారు. మండలంలోని కాణిపాకం పంచాయతీ అరుణానగర్ లేఅవుట్‌లో శుక్రవారం ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. అనంతరం ఇళ్ల నిర్మాణాలపై మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. లబ్ధిదారులకు అవగాహన కల్పించి మండలంలో పురోగతి సాధించాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కుసుమకుమారి, హౌసింగ్ ఏఈ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాజెక్టుకు చేరుతున్న వరద నీరు

సదుం: మండల సరిహద్దులోని సోమల మండల అటవీ ప్రాంతంలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల మూలాన వాగులు, వంకలు పరుగులు తీస్తున్నాయి. వర్షపు నీటితో గార్గేయ నది ప్రవహిస్తూ మండలంలోని కొర్లకుంటవారిపల్లె ప్రాజెక్టుకు చేరుతోంది. మరి కొన్ని రోజులు ఇలాగే వర్షాలు కురిస్తే ప్రాజెక్టుకు జలకళతో తొణికిసలాడుతుందని ప్రజలు ఆశాభావంతో ఉన్నారు. ఇక, శుక్రవారం మధ్యాహ్నం మండలంలోని పలు ప్రాంతాలలో మోస్తరు వర్షం కురిసింది.

కొత్తపల్లెలో నేలకొరిగిన వరి పంటలో రైతు



పొలంలో తడిసిపోయిన వరి కుప్పలు



వరి.. వర్షార్పణం

బంగారుపాళెం: మండలంలో ఇటీవల కురిసిన వర్షానికి పలు గ్రామాల్లో వరి నేల వాలిపోయింది. మూడు రోజుల పాటు మోస్తారు వర్షం కురిసింది. అయితే గురువారం రాత్రి వర్షం భారీగా కురిసింది. దీంతో పలు చోట్ల రైతులకు సంబంధించిన వరి నేల వాలిపోయింది. మండలంలోని కొత్తపల్లెకు చెందిన రైతు చంద్రశేఖర్ సాగు చేసిన వరిపంట పూర్తిగా నేలకొరిగింది. మరో రైతు సుబ్రమణ్యం సాగు చేసిన వరి పంట చేతి కందడంతో కోత మొదలు పెట్టాడు. కోసిన వరి కుప్పలన్నీ పొలంలోనే తడిసిపోయాయి. వర్షానికి పొలంలో నీరు నిలిచిపోయింది. అయితే ఈ వర్షానికి నష్టపోయిన పంటను అంచనా వేసి పరిహారం అందించడానికి అధికారులెవరూ రాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ తుపాను కారణంగా నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం అందజేసి ఆదుకోవాలని సీపీఎం నాయకుడు మురళి కోరారు.

డార్మిటరీకి చాపల విరాళం

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలోని ఉచిత డార్మిటరీకి దాతలు చాపలను విరాళంగా అందజేశారు. కర్ణాటకలోని ముళబాగిళ్‌కు చెందిన రమేష్ బాబు, రఘురామయ్య 150 చాపలను ఆలయ అధికారులకు అందించారు. అనంతరం వారికి అధికారులు ప్రత్యేక స్వామి దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈవో గురుప్రసాద్, ఇతర అధికారులు ఉన్నారు.

రేపటి నుంచి పల్లె పండుగ

గుడిపాల: మండలంలో 20వ తేదీ నుంచి పల్లె పండుగ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శివరాజన్ శుక్రవారం తెలియజేశారు. 20వ తేదీన ఉపాధి హామీ కింద మంజూరైన సిమెంట్‌రోడ్లు, బీటీ రోడ్లకు శంకుస్థాపనలను ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు వివరించారు. ఇందులో భాగంగా 20వ తేదీన కొత్తకోట, 197రామాపురం, నంగమంగళం, పానాటూరు, కిల్లారిపల్లె, రామభద్రాపురం, గుర్రాళ్లమిట గ్రామాల్లో శంకుస్థాపనలు చేపట్టనున్నట్లు తెలిపారు.

ఈ పంట నమోదు తప్పనిసరి


గ్రామసభలో మాట్లాడుతున్న అధికారులు

గుడిపాల: రైతులు సాగు చేసిన పంటను ఈ పంట యాప్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారి మాధవి తెలిపారు. పాపసముద్రం పంచాయతీలోని రైతుసేవా కేంద్రంలో గురువారం ఖరీఫ్–2024 ఈ పంట సామాజిక తనిఖీ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ పాపసముద్రం పంచాయతీలో 450 ఎకరాలకు 344 మంది రైతులకు ఈకేవైసీ పూర్తిచేసినట్లు చెప్పారు. గ్రామసభలో రైతులకు సంబంధించి రైతు పేరు, ఆధార్ నంబర్, సాగుచేసిన పంట, పంటరకం, పంటసరళి రైతులకు చదివి వినిపించారు. ఇందులో ఏవైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే రాతపూర్వకంగా అర్జీ సమర్పిస్తే మార్పులు, చేర్పులు చేసి తుదిజాబితాను తయారుచేస్తామని తెలియజేశారు. ఈ పంట నమోదు డేటా ఆధారంగానే పంటలకు సున్నావడ్డీ, పంటరుణాలు, బీమా, నష్ట పరిహారం, రైతులకు పెట్టుబడి సాయం అందుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చిట్టిబాబు, అగ్రికల్చర్ అసిస్టెంట్ తులసీ రాంరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ చేస్తే చర్యలు

పలమనేరు: స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు తప్పవని అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటప్రసాద్ హెచ్చరించారు. పీసీపీఎన్‌డీటీ చట్టంపై శుక్రవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, స్కానింగ్‌కోసం వచ్చే గర్భవతులకు కొందరు వైద్యులు రకరకాల సంకేతాలతో శిశువు మగ, ఆడా అని చెబుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇలాంటి వారిపై తొలిసారి రెండేళ్ల జైలుశిక్ష, రెండోసారి తప్పుచేస్తే రూ.50వేల జరిమానా, ఐదేళ్ల జైలుతోపాటు వారి వైద్య పట్టాను సైతం రద్దు చేస్తామని హెచ్చరించారు. పలమనేరు పట్టణంతోపాటు ఆయా మండలాలకు చెందిన వైద్యులు ఈ విషయాన్ని స్కానింగ్ సెంటర్ నిర్వాహకులకు స్పష్టం చేయాలన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం మునగాకు


అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ మంజుల

ఐరాల: యాంటీ ఆక్సిడెంట్స్, కాల్షియం, ఐరన్ సమృద్ధిగా ఉండే మునగాకు గర్భిణుల్లో పిండం ఆరోగ్యంగా ఎదిగేందుకు దోహదం చేయడంతో పాటు సుఖ ప్రసవం జరిగేలా ఉపకరిస్తుందని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సెక్టార్ సూపర్‌వైజర్ మంజుల తెలిపారు. మండలంలోని తాళంబేడువారిపల్లె, పేరయ్యగారిపల్లె, చంద్రయ్యగారిపల్లె అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం గర్భిణులు, బాలింతలకు మునగాకు పోషక విలువలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మునగాకు ద్వారా లభించే ఐరన్ గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత నివారణకు దోహదపడుతుందని తెలిపారు. ఎన్నో పోషక విలువలు కలిగిన మునగాకు ఆహారంలో తీసుకోవడం వలన కలిగే ప్రయోజనాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు వీణమ్మ, రాధమ్మ, గౌరి పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులను ప్రోత్సహించాలి




బంగారుపాళెం: ర్యాలీ చేస్తున్న ఉపాధ్యాయులు, గుడిపాల: ర్యాలీలో పాల్గొన్న ఎంఈవో గణపతి, పూతలపట్టు: ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

బంగారుపాళెం: చదువులో వెనుకబడిన దివ్యాంగ విద్యార్థులను ప్రోత్సహించాలని ఎంఈఓ రమేష్ బాబు అన్నారు. సర్వశిక్ష అభియాన్, భవిత కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం డిస్లెక్సియా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. రమేష్‌బాబు మాట్లాడుతూ, డిస్లెక్సియా అనేది వయసుకు తగినట్లు కాకుండా తక్కువగా చదివేలా చేసే ఒక వ్యాధి అని అన్నారు. ఇది వేర్వేరు విద్యార్థుల్లో వేర్వేరు స్థాయిలో ఉంటుందన్నారు. పదాలను సక్రమంగా పలకపోవడం, రాయకపోవడం. త్వరగా చదవకపోవడం, మనసులో చదవలేకపోవడం, వేరే వాళ్లు చదువుతుంటే అర్థం చేసుకోకపోవడం వంటి లక్షణాలు ఉంటాయన్నారు. ఇటువంటి లక్షణాలను సాధారణంగా పాఠశాలల్లోనే గుర్తిస్తారని చెప్పారు.


తవణంపల్లె: ర్యాలీలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు శ్రీకుమారి, నాగరాజ, గిరిజ, ఐఈడీఎస్‌ఎస్ ఉపాధ్యాయుడు భార్గవ్‌రామ్, సహిత విద్యా ఉపాధ్యాయులు మీరయ్య, హిమబిందు, విద్యార్థులు పాల్గొన్నారు.

దివ్యాంగుల్లో నైపుణ్యాన్ని వెలికితీద్దాం

గుడిపాల: దివ్యాంగుల పిల్లల్లో వారి నైపుణ్యాన్ని వెలికితీద్దామని మండల విద్యాశాఖాధికారి గణపతి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో గురువారం దివ్యాంగుల పిల్లలకు డిస్లెక్సియా(అభ్యసన వైకల్యాల)పై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల పిల్లల్లోని కొంతమందికి చదవడం, రాయడం వంటి వాటిల్లో సమస్యలున్న వారిని ప్రత్యేకంగా గుర్తించి వారికి నైపుణ్యాన్ని కలిగించినట్లు తెలిపారు. వారిపై ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకొని పాఠాలు నేర్పనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రత్యేక ఉపాధ్యాయులు వాణి, బబిత, పీఈటీ గురుప్రసాద్, సీఆర్‌పీ మల్లికార్జున పాల్గొన్నారు.

అభ్యసనా వైకల్యంపై ర్యాలీ

తవణంపల్లె: చదవడంలో, రాయడంలో సమస్య(అభ్యసనా వైకల్యం) ఉన్న దివ్యాంగ పిల్లలకు అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించారు. చదవడంలో, రాయడంలో ఇబ్బందులు పడుతున్న పిల్లలకు ఎలా చదవాలి, ఎలా రాయాలి అనే అంశంపై అవగాహన కల్పించారు. ప్రత్యేక శిక్షణ అభ్యసనా కృత్యాలు బోధన ద్వారా చదివించాలని సూచించారు. భవిత కేంద్రంలో అభ్యసనం చేయడం వల్ల దివ్యాంగ పిల్లల చదువులు మెరుపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ త్యాగరాజులు రెడ్డి, హెచ్‌ఎం దేవరాజులు రెడ్డి, సహిత విద్యా ఉపాధ్యాయులు దేవేంద్ర, దిలీప్, నాగభూషణంపాల్గొన్నారు.

దివ్యాంగ పిల్లల ర్యాలీ

పూతలపట్టు: మండల కేంద్రంలోని భవిత కేంద్ర విద్యార్థులు శుక్రవారం అభ్యసనా వైకల్యంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంఈఓ వాసుదేవన్ మాట్లాడుతూ ఇది ప్రధానంగా చదవడం, రాయడం వంటి నైపుణ్యాలపై ప్రభావం చూపుతుందన్నారు. దీనిని ప్రత్యేక శిక్షణ ద్వారా సరిచేయవచ్చన్నారు. యాదమరి మండల కేంద్రంలో భవిత కేంద్ర విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఉన్నత పాఠశాల ప్రదానోపాధ్యాయులు గిరిరాజా, ఉపాధ్యాయులు మోహన్‌రెడ్డి, కృష్ణమూర్తి, లావణ్య, శ్రీదర్, మధు, విష్ణుప్రియ, ఉమా, మహేష్, హరికృష్ణ, జ్యోతీశ్వర్, శిల్ప పాల్గొన్నారు.

వాతావరణంలో మార్పులు.. ఆరోగ్యం జాగ్రత్త


వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

ఐరాల: మారిన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో అంటువ్యాధుల బారిన పడకుండా ప్రజలు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ సూచించారు. మండలంలోని సవటపల్లెలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో డాక్టర్ 65 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఉచిత వైద్య శిబిరంలో గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. గ్రామంలో ఇంటి పరిసరాలను, చుట్టు పక్కల ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమల ద్వారా వ్యాధులు ఒకరి నుంచి మరొకరికి వ్యాపించకుండా నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటి ఆవరణల్లో నిల్వ ఉంచిన టైర్లు, కొబ్బరిచిప్పల వల్ల దోమలు అధికం అవుతాయని, అలాంటివి నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పొంగి పొర్లిన గార్గేయ నది


ఎంపీడీఓ కార్యాలయం వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న గార్గేయ నది

ఐరాల: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో మండలంలో నాలుగు రోజులుగా ఎడతెరపి లేని వర్షం కురుస్తోంది. గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద గార్గేయ నది ఉధృతంగా రోడ్డుపై ప్రవహిస్తుండడంతో రాకపోకలను అధికారులు నిలిపి వేశారు. వరద ఉధృతి తగ్గిన తరువాత రాకపోకలను పునరుద్ధరించారు. గ్రామాల్లోని చెక్ డ్యాంలు, కుంటలు, వాగులన్నీ జలకళను సంతరించుకున్నాయి. కుంటల్లోకి వర్షపు నీరు చేరడంతో పంటల సాగుకు ప్రయోజనం చేకూరుతుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ వర్షం మెట్ట పైరుకు బాగా ఉపయోగపడుతుందని రైతులు చెబుతున్నారు. భూగర్భ జలాలు పెరిగి తాగునీటికి సమస్య ఉండదని ప్రజలు సంతోషపడుతున్నారు. గ్రామాల్లోని చెరువుల్లోకి కూడా పూర్తిస్థాయిలో నీరు చేరి వ్యవసాయానికి అనుకూలంగా ఉంటుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

సావిత్రమ్మ కళాశాలలో పుస్తకావిష్కరణ


సావిత్రమ్మ కళాశాలలో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు

చిత్తూరు కలెక్టరేట్: హిందీ సాహిత్యానికి పేరు తెచ్చేలా హిందీ అధ్యాపకులు షమ్స్ అక్తర్ పుస్తకాన్ని రచించారని సావిత్రమ్మ మహిళా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మనోహర్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆ కళాశాలలో హిందీ అధ్యాపకురాలు షమ్స్ అక్తర్ సంపాదకీయంలో రచించిన పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. అతిథిగా పాల్గొన్న ప్రిన్సిపల్ మాట్లాడుతూ ప్రేమ్ చంద్రోత్తర్ కహానీ సాహిత్యమే సంప్రదాయకత కారన్ ఔర్ పరిణామ్ పుస్తకాన్ని తమ కళాశాల హిందీ అధ్యాపకురాలు రచించడం అభినందనీయమన్నారు. తెలుగు అధ్యాపకురాలు ఉషారాణి మాట్లాడుతూ పుస్తకావిష్కరణ సభలు కళాశాలలో నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో రచనా ఆసక్తి పెరుగుతుందన్నారు. ఇంగ్లీష్ అధ్యాపకులు తిరుకుమరన్ మాట్లాడుతూ ప్రపంచంలో హిందీ భాషా సాహిత్యాలు అన్నింటికన్నా మొదటి స్థానంలో ఉన్నాయన్నారు. హిందీ భాషకు తమ రచనతో తోడ్పడిన హిందీ అధ్యాపకులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ నరేంద్ర, సీనియర్ అధ్యాపకులు పురుషోత్తమనాయుడు, కళాశాల గ్రంథాలయాధికారి కుమారి పాల్గొన్నారు.

నూతన వంగడాలను ఎంపిక చేసుకోవాలి


పంటల సాగుపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారి ప్రవీణ్

తవణంపల్లె: రైతులు అధిక దిగుబడినిచ్చే నూతన వంగడాలు ఎంపిక చేసుకొని సాగు చేయాలని స్థానిక వ్యవసాయాధికారి జి.ప్రవీణ్ తెలిపారు. మండలంలోని టి.పుత్తూరు, దిగువ మోదలపల్లె శుక్రవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా నిర్వహించిన గ్రామ సభల్లో ఏఓ ప్రవీణ్ మాట్లాడుతూ రైతులు తక్కువ ఖర్చుతో సాగు చేసి అధిక దిగుబడినిచ్చే పంటను సాగు చేయాలని సూచించారు. పంటకు రసాయనిక ఎరువులు తగ్గించి సేంద్రియ ఎరువులను వాడడం మంచిదని సూచించారు. మామిడికి యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడి వస్తుందని వివరించారు. రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఏహెచ్ శ్రీధర్ పాల్గొన్నారు.